క్లుప్తంగా

అపర్ణాదేవిని దర్శించుకున్న ఎస్పీ సతీష్‌కుమార్



అపర్ణాదేవిని దర్శించుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవి ఆలయాన్ని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అపర్ణాదేవికి సహస్రనామ కుంకుమార్చన, నాగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కొనసాగుతున్న రాక్ సిరామిక్స్ కార్మికుల ఆందోళన



రాక్ సిరామిక్స్ గేటు ఎదురుగా ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని కోరినా యాజమాన్యం స్పందించడం లేదని సీఐటీయు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ ఫ్యాక్టరీ వద్ద 31 రోజులుగా చేస్తున్న కార్మికుల ఆందోళన సోమవారం కొనసాగింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మూర్తి, ప్రభుదాసు, సతీష్‌కుమార్, శివనారాయణ, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్వామి వారికి ప్రీతైన సోమవారం కావడంతో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజ, తొలి అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద శివలింగానికి పాలతోను, ఆలయ పుష్కరిణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్నలు మూలవిరాట్, ఉప ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లకు పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

కళాకారుల సంక్షేమ సంఘం ఏర్పాటు

పిఠాపురం: జిల్లా గ్రామీణ నాటక కళాకారుల సంక్షేమం కోసం ఆదివారం రాత్రి పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో శ్రీనటరాజ రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు సూరిబాబు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా యడ్ల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా కందుల పద్మనాభం, సెక్రటరీగా ఎలిసెట్టి భానుమతి, జాయింట్ సెక్రటరీగా ముల్లి వీరబాబు, ట్రెజరర్‌గా నక్క ఏసుబాబు, ముఖ్య సలహాదారులుగా కర్రి భాస్కరరావు, బర్రే సత్యనారాయణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాటక నటులు గాది శ్రీనివాస్, బీఎస్ఎస్ఎన్ రెడ్డి, పెద్దిరెడ్డి, పేర్నిడి వెంకన్నబాబు, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన క్రమశిక్షణను అలవర్చుకోవాలని మేజర్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సోమవారం విద్యార్థుల కర్తవ్య బాధ్యతల వేడుక నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. మేజర్ మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఆశల జెల్లకి

- ఇప్పటివరకూ ఊసులేని నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం
- ఎన్నికల మేనిఫెస్టో హామీపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం!
- ఆర్థిక పరిస్థితిని బూచీగా చూపుతుండడంపై అనుమానాలు
- పాలకుల వైఖరిపై మండిపడుతున్న నిరుద్యోగులు
- పెద్దాపురం నియోజకవర్గంలో 96 వేల కుటుంబాలు, 22 వేల మంది నిరుద్యోగులు
- పిఠాపురంలో 98 వేల కుటుంబాలు, 18 వేల మంది నిరుద్యోగులు

ప్రతి మనిషి మనుగడ జీవనోపాధిపైనా ఆధారపడి ఉంది. కుటుంబ పోషణకు వారి ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇంటినీ, ఊరినీ, చివరకు సుదూర దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అధికార అందలం ఎక్కడానికి కొన్ని రాజకీయ పార్టీలు సగటు మనిషి ఎదుర్కొనే ఈ బలహీనతను నిచ్చెనగా వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి.. తమ ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగుల సమస్య పావుగా మారింది. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగమంటూ ఆశలు రేకెత్తించి, ఓట్లు దండుకున్నాయి. తీరా అధికారంలోకి వచ్చాక వాటి ఊసే మరిచాయి. నిరుద్యోగులను పావులుగా వాడుకుని ఆశల పల్లకీలో ఊరేగించి, ఇప్పుడు ఆర్థిక పరిస్థితిని బూచీగా చూపించి నిరుద్యోగులను నట్టేట ముంచడానికి సిద్ధమవుతున్నాయి.

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో మొత్తం 96 వేల కుటుంబాలుండగా, వీరిలో సుమారు 22 వేల మంది నిరుద్యోగులున్నారు. అలాగే పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, యు.కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలుండగా, 51 గ్రామ పంచాయతీలున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో మొత్తం 98 వేల కుటుంబాలుండగా, సుమారు 18 వేల మంది నిరుద్యోగులున్నారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపి కూటమి పార్టీల మేనిఫెస్టోలో కుటుంబానికి ఓ ఉద్యోగం ఇస్తామని, అది కూడా చదువు, వయస్సుతో సంబంధం లేదని హామీ ఇవ్వడంతో పాటు, నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఆశలు కల్పించి, ఓట్లు దండుకున్నారు. కొన్ని కుటుంబాల్లో ఇద్దరు నుంచి ముగ్గురు నిరుద్యోగులు కూడా ఉన్నారు. అనేక మందికి వయస్సు 35 ఏళ్లు దాటిపోయి, నిరుద్యోగులుగానే ఇంటికి పరిమితమవుతున్నారు.





వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు(ఫైల్)

పెద్దాపురంలో..

నియోజకవర్గ పరిధిలో రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాలున్నాయి. సామర్లకోట మండలంలో 18 గ్రామాలు, పెద్దాపురం మండలంలో 23 గ్రామాలు ఉన్నాయి. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగ ప్రకటనలు కనిపిస్తే, వెంటనే నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటికీ తల్లిదండ్రులపైనే ఆధారపడుతున్నారు. కూటమి పార్టీలు.. ప్రతి కుటుంబానికి ఓ ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో, నిరుద్యోగులు తమ తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని ఆశించారు. ప్రతి అవసరానికి ఒకరి ముందు చేయి చాపాల్సిన గత్యంతరం ఉండదని, గౌరవంగా జీవనం సాగించవచ్చని కలలు గన్నారు. కానీ, ఇప్పటి వరకూ ఆయా హామీలకు సంబంధించి విధానపరమైన ప్రకటన వెలువడక పోవడంతో.. నిరుద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాట నిలబెట్టుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందజేస్తే, ఆ మొత్తంతో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కోచింగ్ తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఉద్యోగం లేకపోవడంతో తల్లిదండ్రులపై ఆధార పడటం బాధగా ఉంది. గతంలో మాదిరిగా కాకుండా, అధికార పార్టీ నాయకులు మాట నిలబెట్టుకోవాలి.

– సింగంశెట్టి మణికంఠ, నిరుద్యోగి, సామర్లకోట

కూటమి ప్రభుత్వం భృతితో ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి ఇస్తానన్న హామీ నిలబెట్టుకోవాలి. ఉద్యోగ అవకాశాలు లేక తల్లిదండ్రులకు భారమవుతున్నాం. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకూ నిరుద్యోగ భృతితో ఆదుకోవాలి.

– దడాల పాల్‌రాజ్, కొండెవరం

భృతికి వయో పరిమితి పెంచాలి



నిరుద్యోగులైన యువతీ యువకులకు నిరుద్యోగ భృతి వయో పరిమితిని పెంచాలి. డిగ్రీ, బీఏ, బీఈడీ చేసి ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగ భృతికి నిరుద్యోగులైన ప్రతిఒక్కరికీ అవకాశం కల్పించాలి.

– బర్రే నాగబాబు, జొన్నలగరువు

ప్రజలకు అండగా ఉంటాం



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేసే వరకూ ప్రజలకు అండగా ఉండి పోరాటం చేస్తాం. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిని కచ్చితంగా అమలు చేయాలి. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి చూపించారు. అమలు చేయగలిగే హామీలను మాత్రమే ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక పవిత్ర గ్రంథంగా భావించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ప్రస్తుత తరుణంలో ప్రజా సమస్యలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోరాటాలు చేస్తాం.

– దవులూరి దొరబాబు, పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ, సామర్లకోట

పాదగయ జంక్షన్ వద్ద ప్రమాదాలు నివారించండి



ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఉమా కుక్కుటేశ్వర వ్రత పురోహిత సంఘ నాయకులు

పిఠాపురం: పిఠాపురంలోని పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వరస్వామి ఆలయం వద్ద గల బైపాస్ రోడ్డు నాలుగు రోడ్ల జంక్షన్‌లో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో వాహనదారులు, ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పురోహిత సంఘం సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. హైవే నాలుగురోడ్ల జంక్షన్లో ట్రాఫిక్ రద్దీ భారీగా పెరిగిపోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాల వేగ నియంత్రణ లేకపోవడం, ఏ వాహనం ఎటువైపు వెళ్తుందో తెలియని ఆయోమయంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు రాత్రి పూట వెలగకపోవడం కూడా ప్రమాదాలు జరిగేందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఆదివారం ఆలయానికి సంబంధించిన అర్చకులు కోట ఫణిశర్మ ఈ జంక్షన్ వద్దే రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తుల రాక బాగా పెరుగుతూ ఉంది. ఆలయం సమీపంలోనే మూడు పోలీస్‌స్టేషన్లు ఉన్నా ఇక్కడ ప్రమాద నివారణా చర్యలు శూన్యమని ఉమా కుక్కుటేశ్వర వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు పొక్కులూరి నారాయణ సోమయాజులు వాపోయారు. ఇప్పటికైనా పోలీసు, మున్సిపల్, హైవే అథారిటీ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మరిడమ్మకు ఆషాఢ సారె



మరిడమ్మ అమ్మవారికి సారె తీసుకు వెళుతున్న మహిళలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి స్థానిక సాయి సేవా గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం ఆషాఢ సారెను అందజేశారు. స్థానిక శివాలయం వీధిలోని సాయిబాబా గుడి వద్ద నుంచి పాదయాత్రగా సభ్యులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. తొలిసారిగా అమ్మవారి చీర, సారెను ముత్తయిదువల చేతుల మీదుగా అందజేశారు. ఏటా ఆషాఢ మాసం అమ్మవారి జాతరలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేస్తున్నట్టు సభ్యులు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలి

ఆర్డీఓ జేఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ ఆల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్‌లో స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లపై ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని పీహెచ్‌సీల డాక్టర్లు అనూపారాయ్, నిహారిక, అనూష, న్యాయవాదులు కందుల వెంకటాచలం, ఎన్‌జీఓ సభ్యులు వాసవి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధాకు మ్యాజిక్ స్టార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బుద్ధా శ్రీనివాస్

పెద్దాపురం: పట్టణానికి చెందిన జాతీయ స్థాయి సైంటిఫిక్ మెజీషియన్ బుద్ధా శ్రీనివాస్‌కు డాక్టర్ బోస్ మ్యాజిక్ స్టార్ అవార్డు లభించింది. ఈ మేరకు ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మ్యాజిక్ రంగంలో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథం, అవగాహన పెంపొందించేలా దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చినట్టు శ్రీనివాస్ తెలిపారు. సంఘ అధ్యక్షుడు కేవీఆర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్యల్ ప్రసాద్, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత స్టిక్ మనోహర్ చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. ఆయనను పట్టణ ప్రముఖులు, ప్రజా సంఘాల వారు అభినందించారు.

సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్పవరం జంక్షన్‌లో స్వాతంత్ర సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సంఘ ప్రతినిధులు చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ రాజకీయ వేత్తగా, విద్యావంతురాలిగా, స్త్రీ జనోద్ధరణ, సంఘ సంస్కరణకు దుర్గాబాయి ఎన్నో సేవలందించారన్నారు. 1909 జూలై 15న రాజమండ్రిలో జన్మించారని, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. మహిళలకు ఆస్తి హక్కు, వివాహ చట్టాలతో మహిళలకు రక్షణ తదితర వాటికి కృషి చేశారని కొనియాడారు. భారత ప్రభుత్వం 1975లో పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించిందన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

- జేసీ రామసుందర్ రెడ్డి
- పరిష్కార వేదికకు 274 అర్జీలు



దబ్బ కాలువ నిర్మాణంపై జేసీకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. పెద్దాపురం రాజుగారి వీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆర్డీఓ జేఎస్ రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. అర్జీలపై ఆయా శాఖల అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. భూమి ఆన్‌లైన్ నమోదు, సర్వే, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాలు, బీమా, సదరం సర్టిఫికెట్లు, ఏలేరు దబ్బ కాలువ బ్రిడ్జి నిర్మాణం, మురికి కాలువ పూడికతీత, పారిశుధ్యం, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, గంజాయి రవాణా, శ్మశాన వాటిక స్థలం మంజూరు, జనావాసాల్లో పాముల బెడద, వీధి కుక్కల స్వైర విహారం తదితర సమస్యలపై 274 అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత, డీఎల్పీఓ బాలామణి, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, ఎంపీడీఓ ఎం.ఉషారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది

గండేపల్లి: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం...రంపచోడవరానికి చెందిన కేతమాల సూర్యచంద్ర మోటార్ సైకిల్‌పై వడిశలేరు నుంచి కిర్లంపూడి మండలం బూరుగుపూడిలోని అత్తవారింటికి వెళుతున్నాడు. మండలంలోని నీలాద్రిరావుపేట వద్దకు వచ్చే సరికి సిమెంట్ బస్తాలతో జగ్గంపేట వైపు నుంచి వస్తున్న లోడు ఆటో ఒక్కసారిగా మలుపు తిరగడంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సూర్యచంద్ర ఎడమ కాలికి తీవ్రగాయమైంది. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది సతీష్, రాంబాబు క్షతగాత్రునికి తక్షణ సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి రోడ్డు సేఫ్టీ అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పట్టణానికి చెందిన వైద్యుడు ఎస్.విజయబాబు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో కాలుష్యం నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం, చెట్లు నరకడం వంటివి పెరిగిపోయాయని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రణాళిక రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దీనికి పట్టణంలో ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

జగ్గంపేట: నియోజకవర్గంలోని టెట్, డీఎస్సీ అభ్యర్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అనువైన ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ, కాపు కల్యాణ మండపం, స్టేడియంలోని ఏదో ఒకచోట శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజనం, టీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఉత్తమ ప్రదర్శనగా రాత నాటిక

బోట్‌క్లబ్: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా సూర్య కళా మందిరంలో నిర్వహించిన నాటిక పోటీల్లో వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి రాత నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా కరీంనగర్ చైతన్య భారతి వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కత్రిపాడు వారి విముక్తి నాటిక, ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనగా గుంటూరు ఆరాధన ఆర్ట్స్ వారి క్షేత్రం నాటిక ఎంపికయ్యాయి. ఉత్తమ బాల నటనకు సురభి వాగ్దేవి(రాత), ఉత్తమ నటుడిగా జీవీ మనోహర్(క్షేత్రం), ద్వితీయ ఉత్తమ నటుడిగా పి.ముత్యాలరావు(మలిసంధ్య), ఉత్తమ నటిగా జ్యోతిరాజ్(మూల్యం), ద్వితీయ ఉత్తమ నటిగా జ్యోతిరాణి(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ రచనగా రచయిత సింహప్రసాద్(మూల్యం), ఉత్తమ దర్శకునిగా శ్రీనివాసరావు(రాత), ఉత్తమ విలక్షణ నటనకు వి.నాంచారయ్య, ఉత్తమ సహాయ నటిగా గుడివాడ లహరి(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ సహాయ నటుడిగా ఎ.రామ్‌తేజ్(విముక్తి), ఉత్తమ హాస్య నటుడిగా శ్రీపూర్ణా సత్యం(క్షేత్రం), ఉత్తమ ప్రతి నాయకుడిగా ఎస్ వేంకటేశ్వరరావు(విముక్తి), ఉత్తమ సంగీతానికి నాగరాజు(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ ఆహార్యానికి సింగూరు రమణారావు(అ సరసాల), ఉత్తమ రంగాలంకరణకు శ్రీరాము(నాలోన నీవే), ఉత్తమ రంగోద్దీపనకు సురభి ఉమాశంకర్(రాత), జ్యూరీ బహుమతి బి.నాగరాణి(విముక్తి), కరణం సరిత(నాలోనే నీవే) కైవసం చేసుకున్నారు. వీరికి బహుమతులు, నగదు పురస్కారాలను సంస్థ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానంద బాబు సోమవారం అందించారు.

గృహ నిర్మాణాలకు ముందుకు రండి

లబ్ధిదారులకు కమిషనర్ సూచన



లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కొమరగిరి లేఅవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన తమ వాటా సొమ్మును త్వరగా సమకూర్చుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. కాకినాడలోని 4,5,6 డివిజన్ల గృహ నిర్మాణ లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసే అంశంపై సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ లేబర్ ఏజెన్సీ ద్వారా గృహ నిర్మాణాలకు రూ.3 లక్షల నుంచి రూ.3.20 లక్షల వరకు ఖర్చవుతుందని గతంలో అంచనా వేశారన్నారు. ఇందులో రూ.1.80 లక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయని, మిగిలిన సొమ్మును లబ్ధిదారుల వాటాగా సిద్ధం చేసుకోవాలన్నారు. సొమ్ము సిద్ధం చేస్తే గృహ నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల వద్ద మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ కె.సత్యనారాయణ రెడ్డి, ఆయా డివిజన్ల స్పెషల్ ఆఫీసర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు

నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సోమవారం ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. జగన్నాథపురం ఎంఎస్ఎన్ మూర్తి మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తూ మరణించిన సత్యనారాయణ స్థానంలో ఆయన భార్య దుర్గాదేవికి నగరపాలక సంస్థ సాధారణ విభాగంలో పనిచేసేలా ఉత్తర్వులు అందజేశారు. ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ మృతి చెందిన తాతబ్బాయి స్థానంలో ఆయన సతీమణి సంగంరెడ్డి భవానికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.